నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం మార్చి 02, 2025 www.navatelangana.com

బాబ్లీ నుంచి ఔట్‌ఫ్లో అంతంతే

- 0.6 టీఎంసీల నీటి విడుదలకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-మెండోరా



సుప్రీంకోర్టు తీర్పులో భాగంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను శనివారం ఎత్తివేశారు. జంతువుల తాగునీటి సౌకర్యార్థం, ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల్లోని అక్కడక్కడ గుంతల్లో నిలిచిన నీటికి బదులుగా మార్చి 1న 0.6 టీఎంసీల నీటిని బాబ్లీ ప్రాజెక్టు నుండి ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి విడుదల చేయాల్సి ఉంటుంది. ఉత్తర్వుల్లో భాగంగా తెలంగాణ సిడబ్ల్యుసి అధికారులు , మహారాష్ట్ర అధికారుల సమక్షంలో బాబ్లీ గేట్లు శనివారం ఎత్తివేశారు. కానీ బాబ్లీప్రాజెక్టులో నీరు అంతంత మాత్రమే ఉండటంతో ఎస్సారెస్పీకి ఇన్‌ఫ్లో వచ్చి చేరడం తక్కువే.

వివరాలు మెయిన్‌లో..

ప్రాణం తీసిన పంటరక్షణ విద్యుత్ తీగలు

- తీగలు తగిలి మహిళ మృతి.. ఘటన స్థలాన్ని పరిశీలించిన కామారెడ్డి ఏఎస్పి

నవతెలంగాణ-కామారెడ్డి(మాచారెడ్డి)



అడవి జంతువుల బారి నుంచి పంట రక్షణ కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ గిరిజన మహిళ మృతిచెందిన ఘటన మాచారెడ్డి మండలం లచ్చపేట్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాచారెడ్డి మండలం గజ్యా నాయక్ తండాకు చెందిన లావుడ్యా పారలి(50) అనే మహిళ పంట పొలం వద్ద విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. మృతురాలు ఇంటి నుంచి లచ్చపేట శివారుకు ఎందుకు వెళ్లిందనే వివరాలు తెలియాల్సి ఉందనీ, పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కాగా ఘటనా స్థలాన్ని ఏఎస్పీ చైతన్యరెడ్డి, రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.


లోన గుబులు.. పైకి ధీమా

రేపు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు
పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అంతర్మథనం

- బూత్‌వారీగా ఓటింగ్ సరళిపై చర్చోపచర్చలు
- గత కంటే పెరిగిన ఓటింగ్ ఎవరివైపు వెళ్లిందోనన్న అనుమానాలు
- 2019లో ఒకరిద్దరి మధ్యనే పోటీ.. ఇప్పుడు నలుగురి మధ్య బిగ్‌ఫైట్
- అధికార పార్టీ, అందులోనూ సగానికిపైగా ఎమ్మెల్యేలు...
- సంస్థాగతంగా బలంగా ఉన్న శ్రేణుల కష్టంపై కాంగ్రెస్ ఆశలు
- బీసీ నినాదం, బీఆర్ఎస్ మద్దతుపైనే హరికృష్ణ ఆత్మస్థైర్యం
- బడ్జెట్ పాఠశాలలక్షేత్రస్థాయి పట్టుపైనే శేఖర్‌రావు ధీమా

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలల్లో పోలింగ్ ఘట్టం ముగియగా.. రేపు విడుదల కానున్న ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పట్టభద్రుల స్థానానికి సంబంధించి త్రిముఖ పోరు నెలకొంది. దీంతో ప్రధాన అభ్యర్థుల్లో లోన గుబులు పడుతూనే పైకి తామే గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. బూత్‌వారీగా పోలైన ఓట్లు, శ్రేణులు చేసిన సర్వే రిపోర్టును నిశితంగా పరిశీలించే పనిలో పడ్డారు. అనుకూలతలు ఉన్న బూత్‌కంటే ప్రతికూలంగా కనిపించిన బూత్‌ల్లో ఏ మేరకు మొదటి ప్రాధాన్యత సాధించామనే లెక్కల్లో ఆయా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ అనుచరులతో తలమునకలయ్యారు. పైగా గతంలో అనూహ్యంగా పెరిగిన ఓటింగ్ ఎవరిని ప్రభావితం చేస్తుందోనన్న చర్చ ప్రజల్లో మొదలవగా.. పోటీపడీ మరీ డబ్బులు పంపిణీ చేసిన రెండు జాతీయ పార్టీల భవితవ్యం ఏంటనే ప్రశ్నలూ వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైనా పట్టభద్రుల్లో కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి హరికృష్ణకు భారీ ఎత్తున ఓట్లు పోలైనట్టు తెలుస్తోంది. టీచర్ ఎమ్మెల్సీ కంటే పట్టభద్రుల స్థానంపైనే అందరి చూపు ఉండగా... రేపు లెక్కించబోయే ఓట్లలో ఎవరికి తూకం పడనుందో తేలిపోనుంది.

నవతెలంగాణ - నిజామాబాద్



పట్టభద్రులకు సంబంధించి మొత్తం 56 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. కేవలం ముగ్గురు అభ్యర్థుల నడుమనే ప్రధాన పోటీ నెలకొంది. అందులో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వుట్కూరి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి పోటీ చేసిన ప్రసన్నహరికృష్ణ ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నేత సర్దార్ రవీందర్‌సింగ్ సైతం పోటీ ఉన్నప్పటికీ ఆయనకు పార్టీ నుంచి పెద్దగా సపోర్ట్ లేదనే చెప్పవచ్చు. అందుకు కారణాలు లేకపోలేదు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా రవీందర్‌సింగ్ తెరమీదకు వచ్చినా... చివరి నిమిషం వరకూ పార్టీ ఎటూ తేల్చకపోగా పోటీలో ఉండబోమని ప్రకటించింది. పైగా ఈ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ప్రసన్నహరికృష్ణకు పరోక్షంగా మద్దతుగా నిలిచిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. దీంతో రవీందర్‌సింగ్ మినహా మిగిలిన ముగ్గురి మధ్యనే పోటీ నెలకొంది.

2013 నుంచి పెరుగుతున్న కౌన్సిల్ ఎన్నికల ఓట్ల శాతం

2013 కౌన్సిల్ ఎన్నికల్లో కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో కేవలం 37.38శాతం పోలింగ్ నమోదు అయింది. అప్పుడు మొత్తం 64,586 మంది ఓటర్లలో కేవలం 24,144 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే 2019 ఎన్నికల నాటికి 1,95,581 మంది ఓటర్లలో 1,15,458 మంది (59.03శాతం) మంది ఓట్లు వేశారు. ప్రస్తుతం 2025 పోరులో 355159 ఓట్లలో ఏకంగా 250106 మంది (70.42శాతం) ఓట్లు వేశారు.

ప్రధాన అభ్యర్థుల్లో ఎవరి ధీమాలో వారు...

⇨ ప్రధానంగా అందరిచూపు కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డిపైపే ఉంది. ఆయన అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి ఈ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు. తొలుత ఏ పార్టీ టిక్కెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా స్వతంత్ర్య అభ్యర్థిగానైనా బరిలో ఉంటానని తేల్చారు. తరువాతి పరిణామాల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన సర్వేలో నరేందర్‌రెడ్డికి గెలుపు అవకాశాలు ఉండటంతో ఆ పార్టీ టిక్కెట్ ఇచ్చింది. అందులోనూ గత 2019 ఎన్నికల పరిస్థితి కంటే ఇప్పుడు ఆ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. గత ఎన్నికల్లో మంథని, సంగారెడ్డి నుంచి శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి తప్ప ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు. అయినప్పటికీ జగిత్యాలకు చెందిన సీనియర్ నేత జీవన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొదటి రౌండ్‌లోనే విజయం కైవసం చేసుకుని సంచలనం సృష్టించారు. ఇప్పుడు పార్టీ ఎమ్మెల్యేలు నాలుగు పార్లమెంట్ స్థానాల్లోని సగం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనూ ఆ పార్టీయే అధికారంలో ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగానూ ఉంది. దీంతో నరేందర్‌రెడ్డి గెలుపు నల్లేరుమీద నడకే అన్న ఊహాగానాలు వినిపించాయి. అయినప్పటికీ ప్రత్యర్థులు బరిలో ఉండటం, పెరిగిన ఓటింగ్ శాతంతో ఆ పార్టీలోనూ అంతర్మథనం మొదలైంది. బూత్‌వారీగా పార్టీ శ్రేణుల నుంచి సమాచారం సేకరిస్తూ గెలుపు అంచనాలను లెక్కగడుతున్నారు.

⇨ ప్రధానంగా బీసీ నినాదం, విన్నర్ పబ్లికేషన్స్ అధినేతగా యువతలో సుపరిచితులైన ప్రసన్న హరికృష్ణ సైతం ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు నుంచే ప్రచారంలోకి దిగారు. ఈయన కూడా అధికార కాంగ్రెస్ టిక్కెట్ ఆశించారు. అయిప్పటికీ అక్కడ స్పేస్ లేకపోవడంతో విపక్ష పార్టీ బీఆర్ఎస్ టిక్కెట్ అయినా వస్తుందని అందరూ భావించారు. తీరా ఆ పార్టీ పోటీలో ఉండకపోవడంతో ఆయన బీఎస్పీని ఎంచుకున్నారు. ఆ పార్టీ టిక్కెట్‌పై అత్యధికంగా బీసీ ఓటర్లు ఉన్న నేపథ్యంలో బీసీ నినాదాన్ని ఎంచుకుని మరీ బరిలో నిలిచారు. రెండు జాతీయ పార్టీలకు ధీటుగా ప్రచారాన్ని కొనసాగించారు. బీసీ సంఘాల నుంచి కూడా మద్దతు కూడగట్టారు. పైగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మద్దతు పరోక్షంగా హరికృష్ణకు లభించినట్టుగా తెలుస్తోంది. ఆ పార్టీ ఓట్లన్నీ గంపగుత్తగా ఈయనకే పడ్డట్టుగా ప్రచారమూ సాగుతోంది. ఏదేమైనా ఆయన తన గెలుపు అంచనాపై అనుచరులతో లెక్కలుగట్టే పనిలో పడ్డారు.

⇨ ఇక సంగారెడ్డి జిల్లాకు చెందిన బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ప్రత్యర్థుల కంటే ప్రచారంలో వెనుకబడ్డారు. కేవలం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌పైనే భారం వేసి ప్రచారం నిర్వహించారు. అందులోనూ అంజిరెడ్డికి అన్ని జిల్లాల్లో ముఖపరిచయం లేదనే విమర్శలూ లేకపోలేదు. పైగా ఆ పార్టీ అభ్యర్థిగా చివరి నిమిషంలో తెరమీదకు వచ్చారు. అయినప్పటికీ కేంద్ర మంత్రి సంజయ్ అన్నీ తానై ప్రచారాన్ని నిర్వహించారు. గత రెండు వారాల్లో అధికార కాంగ్రెస్‌పైనే విమర్శలు చూస్తే మతపరమైన అంశాల జోలికి వెళ్లారు. ఇదంతా పట్టభద్రుల్లో కొన్ని వర్గాల నడుమ సానుకూలత తీసుకొచ్చినా.. మెజార్టీ గ్రాడ్యుయేట్లలో విముఖతే కనిపించింది. అయినప్పటికీ బీజేపీకి చెందిన ఎమ్మెల్యేలూ 8 మంది ఈ గ్రాడ్యుయేట్ సెగ్మెంట్లలోనే ఉండటం, సంజయ్, కేంద్రంలోని మోడీ చరిష్మా కలిసొస్తుందనే ధీమాలో అంజిరెడ్డి, ఆయన అనుచరవర్గం ఉన్నది.

టీచర్ ఎమ్మెల్సీ స్థానంఎవరికి దక్కేనో...

పీఆర్‌టీయూ నుంచి పోటీచేస్తున్న వంగ మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి పోటీచేస్తున్న కొమురయ్య, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్సీఎస్టీయూఎస్ మద్దతుతో పోటీచేస్తున్న అశోక్‌కుమార్ మధ్య పోటీ తీవ్రంగానే సాగింది. మొత్తం 27,088 ఓట్లలో ఏకంగా 24895 (91.90శాతం) ఓట్లు పోలయ్యాయి. అయితే వీరిలో సైతం ఎవరి గెలుపుధీమాలో వారు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సాగునీటి సమస్య తలెత్తితే..
సంబంధిత అధికారులదే బాధ్యత

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం
- అలసత్వాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

నవతెలంగాణ-బోధన్

జిల్లాలో ఎక్కడైనా సాగు నీటి సమస్య ఉత్పన్నమైతే, సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. విధుల పట్ల అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తూ సాగునీటి సరఫరాను సక్రమంగా పర్యవేక్షించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం బోధన్ పట్టణంలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి కలెక్టర్ శనివారం ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల కింద ఆయకట్టు కలిగిన పంటల పరిస్థితి, అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ప్రధాన జలాశయాలైన శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లతో పాటు చెరువులలో నీటి నిల్వలు ఈసారి ఒకింత ఎక్కువ మొత్తంలోనే అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పంటలకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. సాగునీటి పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ సీ.ఈ లకు సూచించారు. జిల్లాలో తాగునీటి సమస్య సైతం నెలకొనకుండా అప్రమత్తతతో కూడిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రస్తుత యాసంగి సీజన్ లో ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత సీజన్లతో పోలిస్తే ఈసారి ఎరువులకు పెద్ద ఎత్తున డిమాండ్ నెలకొని ఉందన్నారు. గతేడాది రబీలో 63 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా, ఈసారి 77 వేల మెట్రిక్ టన్నులకు ఎరువుల డిమాండ్ పెరిగిందని వివరించారు. దీని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని రైతాంగం అవసరాలకు సరిపడా ఎరువుల స్టాక్ ను ముందుగానే తెప్పించుకుని, అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న దృష్ట్యా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులకు సూచించారు. సాంకేతికత సహాయంతో ఆస్తి పన్నును పక్కాగా లెక్కిస్తూ, నూటికి నూరు శాతం వసూలయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరందాలి

- మిషన్ భగీరథ డిఈ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)



ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా ఉండాలని మిషన్ భగీరథ డిఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం రాజంపేట్ మండలంలోని శివాయిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ క్యూసీ టీం పర్యటించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంకులు, పై ప్లాన్ పరిశీలించి ప్రతి ఇంటికి త్రాగు నీరు అందే విధంగా చూడాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో నీటి కష్టాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అరుణ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రజిత, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టణం నడిబొడ్డున భార్యను హత్య చేసిన భర్త

- అనంతరం అదే కత్తితో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-కామారెడ్డి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి పట్టణంలో మిట్ట మధ్యాహ్నం నడీ రోడ్డుపై భార్యపై కత్తితో దాడి చేసి హత్యచేశాడో భర్త. అనంతరం అదే కత్తితో తాను పొడుచుకొని ఆత్మహత్యా యత్నం చేశాడు. గాయాపడ్డ అతడిని ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి పట్టణం నిజాంసాగర్ చౌరస్తా సమీపంలో ఉన్న సులబ్ కాంప్లెక్స్ లో పనిచేస్తున్న మోసారపు నర్సింలు అనే వ్యక్తి, అతని భార్య అయిన మహేశ్వరిని (45) పదునైన కత్తితో దాడి చేశాడు. దీంతో అమె అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు సమాచారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మహేశ్వరి కామారెడ్డి లో ఒక హెూటల్ నందు లేబర్‌గా పనిచేస్తున్నట్టుగా తెలిసింది. హత్య చేసి ఆపై ఆత్మహత్యకు ప్రయత్నం చేసిన నరసింహులుని మెరుగైన చికిత్సకోసం నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలి బంధువులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చే వరకు మృతదేహాన్ని కామారెడ్డి మార్చురీలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు. కాగా ఘటన స్థలాన్ని ఏ ఎస్ పి కామారెడ్డి చైతన్య రెడ్డి పరిశీలించారు.

మిషన్ భగీరథ పనులతో రాంగ్‌రూట్‌లో ప్రయాణం

నవతెలంగాణ-సదాశివనగర్



నెమ్మదిగా సాగుతున్న పనులు

సదాశివనగర్ మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ఆలస్యంగా చేపడుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని కామారెడ్డి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ నూతనంగా పైపులైను వేయడం వల్ల సర్వీసు రోడ్డు మూసి వేయడం వల్ల కామారెడ్డికి వెళ్లే వాహనదారులు మర్కల్ స్టేజి వరకు ఎదురుగా వెళ్లవలసి ఉంటుంది. రాంగ్ రూట్‌లో ప్రయాణంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మిషన్ భగీరథ పనులు తొందరగా పూర్తి చేసి సర్వీసు రోడ్డును క్రమబద్ధీకరణ చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

రైతాంగ హక్కులకై ఐక్యంగా ఉద్యమించండి

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- రైతులతో సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-మాక్లూర్



సభ్యత్వ నమోదు కార్డు అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం చిన్నాపూరు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా 1936 ఏప్రిల్ 11న అఖిలభారత కిసాన్ సభ ఏర్పడిందని అన్నారు. బ్రిటిష్ కాలంలో సామ్రాజ్య వాద పెత్తనం వ్యతిరేకంగా దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా వాడి మేడి పట్టింది రైతు సంఘం అని తెలిపారు. జమీందారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకే భూమిపై సర్వహక్కులు అందేలా పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. బాంచన్ దొర నీ కాల్మొక్త అన్న పేదలు దున్నేవానికి భూమి కావాలని నినాదిస్తూ నిజాం నిరంకుశ కొరల్ని పీకి గర్జించిందని, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం వీర తెలంగాణ సాయుధ రైతంగా పోరాటాన్ని జరిపి పది లక్షల ఎకరాల మిగులు భూమిని పేదలకు పంపిణీ చేసిన చరిత్ర రైతు సంఘానికి ఉందని తెలియజేశారు. జమీందారి విధానం రద్దు తో పాటు భూమిపై హక్కులు కల్పించే భూ సీలింగ్ చట్టాలు కౌల్దారి రక్షణ చట్టాలు తేవాల్సి వచ్చిందని అన్నారు. బంజారా భూములు పంపకం చేపట్టిందని అన్నారు.

నాగార్జునసాగర్, పోచంపాడు, శ్రీశైలం వంటి భారీ నేటి పారుదల ప్రాజెక్టులు వచ్చాయంటే అది రైతు ఉద్యమాల చలవే అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రైతాంగ పోరాట ఫలితంగా ఉపసంహరించబడ్డాయని అన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే సబ్సిడీ తీసివేయాలని విత్తనాలు, ఎరువుల ధరలు పెంచుతూ కార్పొరేట్ పెట్టుబడేదారులకు అనుకూలంగా ధరలు పెంచుతుందని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి దొడ్డి దారిన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ముసాయిదా పేరుతో రాష్ట్రాలకు పంపింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ముసాయిదాను పెట్టుబడిదారుల కోసమే తీసుకొచ్చిందని అన్నారు. దీన్ని ఆమోదం తెలిపితే కనుక మార్కెట్లో ఉన్న ఉపాధి గాని దడవాయి గాని హమాలిన గాని పని లేకుండా పోతుందని, పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిపోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ముసాయిదాన్ని రైతులందరూ వ్యతిరేకించాలని కోరారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు రైతు రుణమాఫీ ఇంకా పూర్తిగా జమ కాలేదని, రైతుభరోసా రైతులకి ఎకరం ఉన్నటువంటి రైతులకు కూడా పూర్తిగా రాలేదని వెంటనే రైతుల ఖాతాలో రైతుబంధు జమ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర సాయిలు, రైతులు విజయ్, నారాయణ, సాయిలు, కొండ గంగాధర్, ఈడ గొట్టి సాయిలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న ఆశిష్ సాంగ్వాన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా, ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలో 38 కేంద్రాలలో 18,469 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరంలో 8743 మంది, ద్వితీయ సంవత్సరంలో 9726 మంది పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సరఫరా, మెడికల్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుం దని, సూపరింటెం డెంట్ రూంలో సీసీ టీవీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏరోజు కారోజు ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్ నుంచి బందోబస్తుతో తీసుకరావాలని తెలిపారు. ఇన్విజిలేషన్ డ్యూటీలు ప్రక్క మండలం నుంచి వేయాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి సమస్య తలెత్తకుండా నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖాధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు, పాల్గొన్నారు.

చెత్తాచెదారం లేకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




భిక్కనూర్ పట్టణంలో పర్యటిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్

చెత్తాచెదారం లేకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో తెల్లవారుజామున పల్లె ప్రకృతి వనం, శానిటేషన్ పనులను పరిశీలించారు. వ్యాపారస్తులు, టీ, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని అందులోనే చెత్త వేసే విధంగా సూచించాలన్నారు. 44వ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న దాబా హెూటల్ నిర్వాహకులు రోడ్డుపై చెత్తను వేయడానికి గమనించి నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్‌కు తెలిపారు. అనంతరం పట్టణ కేంద్రంలో నాటిన మొక్కలకు నీళ్లు పోశారు. పల్లె ప్రకృతి వనంలో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలని రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. గ్రామంలో నీటి సమస్యలు ఉన్న కాలనీలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ శ్రీనివాస్, ఎమ్మార్వో శివప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కందకుర్తి వద్ద పెరిగిన నీటి ప్రవాహం

నవతెలంగాణ-రెంజల్



శివాలయం సగం వరకు చేరిన నీటిప్రవాహం

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో స్వల్పంగా నీటి ప్రవాహం పెరిగింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. తాగునీటి అవసరాల కోసం మార్చి 1వ తేదీన బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంటుంది. శనివారం ఇరు రాష్ట్రాల అధికారులు బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో నీరు దిగువకు వస్తుండటంతో కందకుర్తి వద్ద గోదావరిలో ప్రవాహం కనిపించింది. కందకుర్తి గోదావరికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కందకుర్తి గోదావరి అలయ కమిటీ సభ్యులు, స్థానిక పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నుంచి వచ్చే మీరు నేరుగా ఎస్ఆర్ఎస్పీలోకి వెళ్తుండడంతో స్వల్పంగా గోదావరిలో నీరు వచ్చి చేరింది.

ఆకురాలింది.. పచ్చదనం పోయింది..



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మొన్నటివరకు పచ్చదనంతో కళకళలాడిన చెట్లు.. ఎండకాలం సమీపించగానే చెట్ల ఆకులు రాలిపోతున్నాయి. దీంతో చెట్లు మోడుబారినట్టు కనిపిస్తున్నాయి. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా చెట్లల్లో మార్పు ఉంటుంది. ప్రస్తుతం దీనిని ఆకురాల్చు కాలం అని కూడా పిలుస్తారు. నిజామాబాద్ నుంచి బాన్సువాడ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మల్కాపూర్ శివారు అటవీ ప్రాంతంలో చెట్లు ఇలా ఎండిపోయి మోడువారాయి.

ప్రజలు నిబంధనలు తప్పక పాటించాలి

- ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సింధు శర్మ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని ప్రజలు పోలీస్ శాఖ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించవద్దని పేర్కొన్నారు. ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుందని సూచించారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ట్రెజరర్ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్ జన్మదిన వేడుకలను శనివారం సంబురంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే పాండే మాట్లాడుతూ.. వారి నాయకత్వంలో కళాశాల అభివృద్ధి సాధించిందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల విజయం తమ ప్రధాన లక్ష్యమని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే పోరాటం

- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు



నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నియోజకవర్గ పోరాటం చేస్తున్నారని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు శనివారం తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి వివిధ సమస్యలను తెలుసుకుని గల్ఫ్ బాధితుల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండే విద్యార్థుల కష్టాలతో పాటు ఎన్నో సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించాడని పేర్కొన్నారు. అధికారుల చుట్టూ, మంత్రుల చుట్టూ తీరిక లేకుండా తిరిగి నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామ సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.2.40 కోట్లు మంజూరు చేయించడం అభినందనీయమని, ఇవే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యల మీద స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అవినీతికి తవులేకుండా పాలన సాగించడమే ఎమ్మెల్యే ధ్యేయమని తెలిపారు.

సబ్ డివిజన్ పిఆర్ నూతన డిఈఈగా ఎం.కిషన్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.కిషన్

నవతెలంగాణ-బాల్కొండ

పంచాయతీరాజ్ బాల్కొండ సబ్ డివిజన్ నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.కిషన్ శనివారం మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డిఈఈగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం మహేందర్ రెడ్డి అనారోగ్యం కారణంగా మెడికల్ లీవ్ తీసుకున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన డిఈఈ ఎం.కిషన్ గతంలో 2008-2012 వరకు బాల్కొండ పిఆర్ ఏఈఈగా ఇక్కడ విధులు నిర్వహించారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల మోహన్ రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన గ్రామశాఖ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి తల్లి, తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన క్యాతం నవీన్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందడంతో శనివారం తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, నాయకులు కొరిపెల్లి లింగారెడ్డి, గుల్లే రాజేశ్వర్, ఆడేం గంగాప్రసాద్, రవిరెడ్డి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, రేండ్ల రమేష్, రొక్కెడ సంజీవ్, సున్నపు అంజయ్య, మునీరోద్దీన్, గజేందర్, దొబ్బల మహేష్, సంసన్, తదితరులు పాల్గొన్నారు.

అసువులు బాసిన అమరవీరులకు నివాళి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు పలుచోట్ల శనివారం నివాళులర్పించారు.

రెంజల్ : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నివాళులర్పించి క్యాండిల్ వెలిగించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ లక్ష్యం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగఫలంతోనే నేడు ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, ఈ కృషి మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండారు పోశెట్టి, లసింగారి నరేష్, లసింగారి రవి ప్రసాద్, దగ్గుల సాయిలు, పోశెట్టి, రవితేజ, బండారి రవి, ప్రభాకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు సాలూర మండలంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద దండోర సంఘం ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనలో గతంలో జరిగిన నిరసన కార్యక్రమంలో భాగంగా గాంధీభవన్ ముట్టడి ఘటనలో అమరులైన సురేందర్, దామోదర్, మహేష్,



ఆర్మూర్: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాల సభ్యులు

ప్రభాకర్, భారతక్కను సంస్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ అమరవీరుల త్యాగాల ఫలితంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఉద్యమం ఫలితంగా నేడు ఎస్సీ వర్గీకరణ కల సాకారమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్ట్ ఫోరం సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి దిలీప్ మాదిగ, మండల కోశాధికారి దమ్మన్ గావ్ విజయ్ మాదిగ, సభ్యులు పులి ఆంజనేయులు మాదిగ, సాలూర గ్రామ అధ్యక్షులు ధమన్గావ్ సుభాష్ మాదిగ, మొండూర్ అశోక్ మాదిగ, మరిగే దత్త్రాత్రి మాదిగ, పిల్లల చాందు మాదిగ, లక్ష్మణ్ మాదిగ, మందర్న సాయిలు మాదిగ, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్ పట్టణంలో జరిగిన మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా నాయకులు మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, నిగురావు, రామకృష్ణ, పోశెట్టి, డల్ల సురేష్, లసింగారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు డప్పుల దరువుతో పాలాభిషేకం చేసినట్లు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కనక ప్రమోద్ తెలిపారు. మండలంలోని తొర్లికొండలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అరవీరులకు డప్పుల దరవుతో పాలాభిషేకంతో ఘనమైన నివాళులు అర్పించినట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వేల్పుల వరుణ్ మాదిగ నాయకత్వంలో, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కనక శ్రీదీప్ మాదిగ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణలో అమరులైన వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాదిగల లక్ష్యమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా వొదిలేసినా మాదిగ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి త్యాగమే నేటి వర్గీకరణ అని అందరూ ముక్తకంఠంతో గొంతెత్తారు. మాదిగ అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు మైలారం బాలు మాట్లాడుతూ.. తెలబండ్ల రవి మాదిగ, సిరా నాగేశ్వరరావు మాదిగ, మీరా సాహెబ్ మాదిగ, గింజారపు ప్రభాకర్ మాదిగ, పొన్నాల సురేందర్ మాదిగ, నడిమిండ్ల దామోదర్ మాదిగ, ములుగు మహేష్ మాదిగ, దర్శనాల భారతి మాదిగ, పెద్దాడ ప్రకాష్ రావు మాదిగకు ఈ సందర్భంగా జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న, మాజీ ఎంపిపి పస్కా నరసయ్య, రింగుల భూషణ్, గంగని స్వామి మాదిగ, మహా సేన జిల్లా అధ్యక్షులు రాములు, ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు ఎల్‌టి కుమార్, డి.నర్సింలు, జంగం గోపి, ఎర్రోళ్ల మల్కన్న, ఐనార్ల భూమయ్య, సాయన్న, పొన్నాల శేఖర్, కొత్తూర్ శ్రీను, బొడ్డు గోపి, చౌదరీ బాలు, నల్ల అంజయ్య, నాగరాజ్, అడ్లూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



రెంజల్: క్యాండిళ్లు వెలిగించి నివాళులర్పిస్తున్న నాయకులు



బోధన్: నివాళులర్పిస్తున్న నాయకులు



జక్రాన్‌పల్లిలో..

వైద్య సేవలపై ఆరా

- సాలుర పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హనుమంతు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఇన్ పేషంట్ వార్డును సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను గమనించారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఇటీవలి కాలంలో పీహెచ్‌సీని సందర్శించారా అని ఆరా తీశారు. సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కాగా శిథిల దశకు చేరుకున్న పీహెచ్‌సీ పాత భవనాన్ని పరిశీలించిన జిల్లా పాలనాధికారి, కొత్త భవనం మంజూరీ వివరాల గురించి ఆరా తీశారు. వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ తదతరులున్నారు.

సాలూరా క్యాంప్ శివారులో పంట పొలాలను పరిశీలించిన ఏఓ



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలూర క్యాంప్ శివారులో శనివారం సాలూర మండల వ్యవసాయ శాఖ అధికారి శ్వేత పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు కాలువ నీటి సరఫరా సరిగా లేకపోవడం వల్ల పంటలు ఎండిపోయాయని రైతులు తెలిపారని అన్నారు. సాగునీరు సరిగా అందకపోతే ఇదే పరిస్థితి తలెత్తితే పంటలు ఎండిపోవడం జరగవచ్చని, ఈ సమస్య పరిష్కరించడానికి, నీటిపారుదల శాఖ అధికారులు డి-28 కెనాల్ కు సంబంధించిన కొన్ని ఉప-డిస్ట్రిబ్యూటరీ కాలువలను పూర్తిగా మూసివేయనుందని తెలిపారు. అవి రాబోయే రెండు రోజుల వరకు మూసివేసి సాలూరా మండలానికి పూర్తి స్థాయిలో కాలువ నీటి సరఫరాను కొనసాగిస్తామని తెలిపారు. అలాగే సాగునీటి సరఫరా మరో ఐదు రోజుల వరకు పొడిగించవచ్చని ఆమె తెలిపారు.

సిర్పూర్ పాఠశాల విద్యార్థిని అక్షయకు జాతీయస్థాయి ఉత్తమ కథా బహుమతి



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిరిపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని టి.అక్షయకు జాతీయస్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో బహుమతి లభించిందని ప్రధానోపాధ్యాయులు వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ఇటీవల సైన్స్ ఫిక్షన్ కథల పోటీలను హైదరాబాద్‌లోని బాల సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించారని, ఈ పోటీలకు సిర్పూర్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు రాసిన 15 కథలను పంపించినట్టు తెలిపారు. అందులో నుంచి టి.అక్షయ రాసిన "రూపాలు మార్చుకునే రోబో" అనే కథ ఉత్తమ కథగా బహుమతిని గెలుచుకుందని వారు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల తెలుగు విద్యార్థులు 143 మంది పాల్గొన్న ఈ సైన్స్ ఫిక్షన్ కథల పోటీలో తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ బహుమతిని గెలుచుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ విద్యార్థులకు కథా రచనల్లో మెలకువలను నేర్పించి మార్గదర్శనం చేసిన తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ కాసుల నరేష్ రావును వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షయకు సంస్థ వారు అందించిన నగదు బహుమతి వెయ్యి రూపాయలను సర్టిఫికెట్‌ను ప్రధానోపాధ్యాయులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, వందన, గాయత్రీనీలేశ్, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్ గ్రామంలో చేపట్టిన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద మంజూరైన రూ.మూడు లక్షలతో చేపట్టిన సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు బేస్మెంట్ వరకు పూర్తయినందున, త్వరితగతిన ఇటుక పనులను చేపట్టి పూర్తి చేయాలన్నారు. వేసవి ఎండలు ముదురినందున మూడుసార్లు నీటిని అందించి క్యూరింగ్ బాగా చేయాలన్నారు. నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నాసిరకంగా పనులు చేస్తే బిల్లులు చెల్లించబోమని నిర్మాణ కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్మాణం పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి త్వరగా సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు పూర్తయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యాను ఆదేశించారు. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.

ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి దూర విద్యా కేంద్రంలో ప్రవేశాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూర విద్యా కేంద్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీజీ డిప్లమా కోర్సులలో ప్రవేశాలకు రెండవ దఫా అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాలలో ఆసక్తి గల అభ్యర్థులు oucde.ne నందు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తుకు చివరి తేదీ 31 మార్చి 2025 అని తెలిపారు. పూర్తి వివరాలకు అధ్యయన కేంద్ర సమన్వయకర్త పి.రాము 9912670252 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిజామాబాద్ జిల్లా నూతన సీఈ సమతకు సన్మానం



సీఈని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ జిల్లా నూతన సీఈగా బాధ్యతలు చేపట్టిన సమతను మండల మాజీ ఎంపీపీ మైదం రాజన్న శాలువాతో పూల బోకేతో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో సీఈ సమతాను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మైదం రాజన్న మాట్లాడుతూ.. గతంలో నిజామాబాద్ జిల్లాలో పనిచేసే వెళ్లి తిరిగి జిల్లాకు సీఈగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఏకాగ్రతే విజయానికి సోపానం


మాట్లాడుతున్న ఎడ్యుకేషన్ ప్రతినిధులు

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులకు ఏకాగ్రతనే విజయాన్ని సోపానమని హెల్పింగ్ బ్రిడ్జి ఎడ్యుకేషన్ ప్రతినిధులు శ్రీధర్ రావు అన్నారు. శనివారం కృష్ణాజివాడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన విజయ స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివినట్లయితే మంచి మార్కులు పొందుతారని అన్నారు పదో తరగతి తర్వాత ఉన్న విజయ రహస్యాలను ప్రతినిధులు కుష్నాకరావు వివరించారు. పేదరికంలో ఉండి విద్య మానేసిన వారుంటే తమ తెలపాలని తాము సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నివేదిత, గిర్మ బోయి, శ్రీహరి, శ్రీను ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైవి గిరి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-సదాశివనగర్

డీఎస్సీ-2024 గణిత విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచి లింగంపేట్ జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విధులకు హాజరైన వారంలోనే మరణించిన వై వి గిరి కుటుంబ సభ్యులను సీపీఎస్ రాష్ట్ర అసోసియేషట్ అధ్యక్షులు జూకంట బాపురెడ్డి శనివారం పరామర్శించారు. తన వంతు సహాయంగా 5000 రూపాయలను అందజేశారు. అనివార్య కారణాలవల్ల సిపిఎస్ ఉద్యోగులు చనిపోయి నట్లయితే తన వంతు సహాయంగా తాను సర్వీసులో ఉన్నంతకాలం 5000 రూపాయలను అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

అప్పులను తీర్చేందుకు
ప్రభుత్వ ఆస్తుల తనఖా

- పేదల కడుపు కొట్టి కార్పొరేట్లకు పెట్టే బడ్జెట్
- దొడ్డి దారిన కార్మిక రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాల అమలుకు కుట్ర
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్


మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన రూ.50,65,345 కోట్ల బడ్జెట్ గ్రామీణ పేదలకు పొట్ట కొట్టి బడా కార్పోరేట్లకు కడుపు నింపే విధంగా ఉందని, చేసిన అప్పులు తీర్చడానికి ప్రభుత్వ ఆస్తులను వేలంపాట వేయడానికి సిద్ధపడిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. దేశ రైతాంగం, కార్మిక వర్గం కలిసికట్టుగా పోరాడి వెనక్కి కొట్టిన నల్ల చట్టాలను తిరిగి దొడ్డిదారిన అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని ఆహార నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన అంటుతున్నాయని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ధరలను కంట్రోల్ చేసే వ్యతిరేకరణ నిధి గురించి ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడకపోవడం ఆందోళనకరం అన్నారు. దేశ జీడిపిలో పెంచక పోగా పదివేల కోట్లు కోత విధించిందన్నారు. యూరియా సబ్సిడీ 11 లక్షల కోట్లను కోత విధించిందన్నారు. రైతుల పండించే పంటలకు కనీస మద్దతు ధరల చట్టం రుణ మాఫీ చట్టం చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసులను పట్టించుకోలేదన్నారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పనికి గత సంవత్సరం కేటాయించిన 89,154 లక్షల కోట్లను కుదించి 86 లక్షల కోట్లను కేటాయించటం ఆందోళనకరం అన్నారు. పట్టణ పేదలకు పని కల్పించి, రోజు కూలి 800 ఇవ్వాలనీ, పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. బడ్జెట్లో రెండున్నర లక్షల కోట్లను కేటాయించాలని డిమాండ్‌ను పట్టించుకోలేదన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి అమలు చేయ చూస్తున్నారన్నారు. ఎనిమిది గంటల పని దినం స్థానంలో 90 గంటలు వారంలో పనిచేయాలని ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలు నిర్ణయం చేయడం ఆందోళనకరం అన్నారు. అ సంఘటిత రంగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్‌ను పట్టించుకో లేదన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థకు ఐసిడిఎస్ ప్రాజెక్టుకు మధ్యాహ్నం భోజనం పథకానికి భారీగా నిధులు కోత విధించారని అన్నారు. ప్రభుత్వం చేసిన అప్పుల నుండి బయటపడటం కోసం ప్రభుత్వ ఆస్తులను డిమానిటైజేషన్ పేరుతో అమ్మకానికి పెట్టిందన్నారు. ఎల్ఐసి బీమా సంస్థలు 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులని అనుమతించాలని దీనిలో భాగమే అన్నారు. 'భూ చట్టాలలో మార్పు తీసుకువచ్చి ఆదాని, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. జీఎస్టీ పేరుతో పేదలువాడే నిత్యవసర సరుకులపై విపరీతమైన పన్నులు విధించి కార్పొరేట్ కంపెనీల ఉత్పత్తులకు లాభాలు వచ్చే విధంగా ప్రణాళికలను ముందుకు తెస్తున్నారు. మధ్యతరగతికి 12 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఉందని ప్రచారం చేస్తున్నా ఆచరణలో మాత్రం 30 శాతం పైగా ఆదాయపు పన్ను విధించారని' తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దరావత్ మోతీరాం, జిల్లా నాయకులు కాట్రోత్ వసంత రావు, పుప్పాల సాయిలు, రామవత్ దశరథ్, ఎక్నాథ్, మంజు జీవన్సింగ్, బాణోత్ కిషన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు గోరంట్ల పద్మజ తెలిపారు. స్థానిక మాజీ సర్పంచ్ బండారు సంజీవులు రూ.12000 విలువ గల పుస్తకాలను శనివారం పంపిణీ చేశారని తెలిపారు. విద్యార్థి దశనుండే మేధావులుగా ఎదిగేందుకు ఉత్సాహంతో ముందుకు సాగాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రసన్న లక్ష్మి, అనిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామానికి ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

స్వచ్ఛ గ్రామానికి ప్రజలు సహకరించాలని పెద్ద మల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ తెలిపారు. శనివారం గ్రామంలో పారిశుద్ధ, శానిటేషన్, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి సమస్య ఉంటే గ్రామపంచాయతీలో తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పడంపల్లిలో హరినామ సప్త



ప్రవచనాలు చేస్తున్న కీర్తనకర్ బల్భీమ్

నవతెలంగాణ-జుక్కల్

అపకారికి ఉపకారము చేయాలి కానీ ఉపకారికి అపకారము తలపెట్టవద్దని మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన గ్రామం ఏడూర్ కీర్తనకర్ బల్భీమ్ అన్నారు. శనివారం పడంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అఖండ హరినామ సప్తహ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. మానవులందరూ సమానమైననని , కులమత భేదాలు ఏవి లేవని, అందరూ ఒకటేనని చాటి చెప్పాలని ఆయన భక్తులకు విన్నవించారు. నిత్యం జీవితంలో కొంత సమయాన్ని పరోపకారికి , సేవలకు ఉపయోగించి పేదలకు వృద్ధులకు సహాయం చేయాలని , ఈ పంచభూతాలు మనలో ఉన్నాయి కాబట్టి మనం ప్రాణాలతో ఉన్నామని , లేకుంటే మనం ఉపయోగం లేని ఈ శరీరం ఎందుకు పనికిరాదని ఆయన భక్తులకు ప్రబోధించారు. ఈ కార్యక్రమంలో పడంపల్లి గ్రామంతో పాటు నాగర్ గాం, ఖండేబల్లూర్ , కత్తల్వాడి , బిజ్జలవాడి , గ్రామాలకు చెందిన భక్తులు కీర్తనలు వినేందుకు భారీగా తరలివచ్చారు

నివాసగృహం దగ్ధం..

- ఆస్తి నష్టం



నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయిలో నివాస గృహం దగ్ధమై 50వేల ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితులు వాపోయారు. గ్రామానికి చెందిన రూప శబరిమాత ఆలయం వద్ద పనులు చేయడానికి వెళ్లగ శనివారం మధ్యాహ్నం ప్రమాదవశత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగి నివాసగృహం దగ్ధం కాగా వంట సామాగ్రి, బియ్యం,బట్టలు, నగదు,విలువైన కాగితాలు కాలి బూడిద అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన స్థలానికి రెవెన్యూ ఇన్స్పెక్టర్ హారిక వచ్చిపంచనామా జరిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండలంలోని మహారాష్ట్ర సరిహద్దున ఉన్న హంగర్గ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల లో విద్యార్థులకు, విద్యార్థినిలకు యువజన సంఘం ఆధ్వ ర్యంలో పెన్నులు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం జరిగిం ది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శనివారం నాడు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మరి యు గ్రామస్తుల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేసి, వారికి రాబోయే మన ధైర్యం నింపేందుకు పరీక్షలలో ధైర్యంగా పరీక్షలు రాయాలని ఎటువంటి భయభ్రాంతు లకు గురి కాకుండ ఉండాలని , విద్యార్థులకు యువజన సంఘం నాయకులు అయిల్వార్ మారుతి అన్నారు . ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు సాయినా థ్, శ్రీనివాస్, సునీల్, రవీందర్, శంకర్, పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో
వివేక్ బయోటెక్ కంపనీ రాక

నవతెలంగాణ-సదాశివనగర్

ఎమ్మెల్యే మదన్ మోహన్ అద్భుత కృషితో సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో వివేక్ బయోటెక్ కంపెనీ నిర్మాణం వేగంగా కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు శనివారం తెలిపారు. యువతకు 2000 ఉద్యోగాలు కల్పించడంతో పాటు, ఇది స్థానిక రైతులకు భారీగా లాభాలు అందించనుందని అన్నారు.

అమరవీరులకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగం మరువలేనిదని, వారి త్యాగాలు వృథా కావని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పెనుకుర్తి రాజనర్సయ్య అన్నారు. నివాళులర్పించిన వారిలో శైలజ, బాణాపురం లావణ్య, ఎల్లయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సు పెంపొందించడానికే విజ్ఞాన ప్రదర్శన



విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న తహసీల్దార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

విద్యార్థుల మేధస్సు పెంపొందించడానికి ప్రతి విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఎంతో అవసరమని తహసీల్దార్ శివ ప్రసాద్ అన్నారు. శనివారం భిక్కనూరు పట్టణ కేంద్రంలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ప్రయోగాత్మక సైన్స్ పరికరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఎంఈఓ రాజా గంగారెడ్డి, ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండి తన మేధస్సుకు పదును చెబుతూ వినూతమైన ప్రయోగాలు తయారు చేయాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని సూచించారు. కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్యార్థి దశలోనే తన మేధాశక్తి పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తయారుచేసిన 74 ప్రయోగాలు సైన్స్ ఎగ్జిబిషన్ లో ప్రదర్శించగా ప్రయోగాలు చూపరులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థు ల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై సదస్సు


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

భారతీయ శిక్షణ మండల్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వ ర్యంలో శనివారం ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో 'నూతన జాతీయ విద్యా విధానం-2020 పరిశోధకులు నిర్వర్తించా ల్సిన కర్తవ్యం' అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్టు కామారెడ్డి జిల్లా భారతీయ శిక్షణ్ మండల్ ప్రముఖ్ పోతన్న తెలిపారు. జ్యోతి ప్రజ్వలన, సరస్వతీ పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ శివరాజ్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం అత్యంత అవసరమైన పాలసీ అని తెలిపారు. కోవిడ్ కారణంగా భారతదేశమంతటా నూతన జాతీయ విద్యా విధానం విస్తరించడానికి ఇబ్బందిలేర్పడ్డాయని, రానున్న రోజుల్లో ఈ విద్యా విధానాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

అంతకుముందు ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మధుకర్ మాట్లాడుతూ భారతదేశానికే కాకుండా ప్రపంచానికి సైన్సును సమాజానికి పరిచయం చేసిన మహామహులు ఎంతో మంది ఉన్నారని, అందుకు ఉదాహరణ నిన్నటి జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించిన సివి రామన్ పరిశోధనలే తార్కాణం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కె ప్రిన్సిపల్ దత్తాత్రి, ఆర్కే డిగ్రీఅండ్ పీజీ కళాశాల డీన్ నవీన్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు డాక్టర్ సతీష్, డాక్టర్ పూర్ణ, డాక్టర్ పోతన్న, తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి దేవరాజ్, స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ రాహుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



నవతెలంగాణ-లింగంపేట్

జాతీయ గ్రామీణ ఉపాధి కింద చేపడుతున్నటువంటి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో నరేష్ క్షేత్ర సహాయకులకు సూచించారు. శనివారం లింగంపేట గ్రామ సమీపంలోని చింతకుంటలో జరుగుతున్న టువంటి ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు సంబంధించి నటువంటి మస్టర్లను పరిశీలించారు. ప్రతి కూలికి పని కల్పించాలని కూలీల శాతం పెంచాలన్నారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్టిలో ఉంచుకొని ఉదయాన్నే పని ప్రదేశాలకు కూలీలు చేరుకునేలా చూడాలన్నారు. కుంటలో పూడికతీత వలన భూగర్భ జలాలు పెరుగుతాయని నీటి విస్తీర్ణం పెరుగుతుందని అంతేకాకుండా కుంటలో మట్టి పంట పొలాల్లో వేసుకున్నట్లయితే రైతులకు అధిక దిగుబడి వస్తుందని అన్నారు. పని ప్రదేశాల్లో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఎంపీ ఓ మలహరి క్షేత్ర సహాయకులు అంజయ్య, శంకర్ కూలీలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగు మర్రి తాండ గ్రామపంచాయతీ పరిధిలో సున్నపురాల తండా లో బుధవారం రాత్రి నివాసపు గుడిసె పూర్తిగా దగ్ధమవడంతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శనివారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి స్పందించి నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా 50 కేజీల బియ్యం, రూ. 2000, దుప్పట్లు, బట్టలు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రగోతం రెడ్డి, బాబురావు, సల్మాన్, కుమ్మరి శంకర్, తండ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు పరిశీలన



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా తాండ గ్రామపంచాయతీ రికార్డులను శనివారం ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. గ్రామంలో పన్నులను 100 శాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి మమతకు ఆదేశించారు. గ్రామంలో గల పల్లె ప్రకృతి వనం, పారిశుద్ధ పనులను ఆయన పరిశీలించారు.

ఇంటిగ్రేడెట్ పాఠశాలకు స్థల పరిశీలన


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలం లోని మోతే గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని తహసిల్దార్ నరేందర్, ఆర్ఐ కిరణ్, సర్వేయర్, సిబ్బంది శనివారం పరిశీలించారు. మోతే గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 164లో 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయా పార్టీల నాయకులు కుల సంఘాల పెద్దలు గ్రామ ప్రజలు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టే స్థలం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

మోతే గ్రామానికి వెళ్లి రోడ్డు కిరువైపులా ప్రభుత్వ స్థలము ఉండడంతో వాటిని సర్వే చేశారు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కొరకు విశాలమైనటువంటి స్థలము అనుకూలంగా ఉండడంతో గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలోని రైతులు ప్రభుత్వ భూమిలో ఏమన్నా పట్టాలు ఉన్నట్లయితే వెంటనే చూపించాలని తహసీల్దార్ సూచించగా.. ఎవరివీ లేవని తెలిపారు. ఈ సర్వేలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి శంకర్రావు, గ్రామ పెద్దలు కుల సంఘాల పెద్దలు గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ మంజూరు పట్ల హర్షం

నవతెలంగాణ-లింగంపేట్

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షనీయం అని బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ అభివృద్ధిలో భాగంగా ఒక్క అడుగు ముందుకు వేసి ఎయిర్ పోర్ట్ ను మంజూరు చేశారని పేర్కొన్నారు. .

నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-దోమకొండ

ఉపాధి హామీ పనులను నిబంధనల ప్రకారం, చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. దోమకొండ మండలంలోని ముత్యంపేట్, చింతమను పల్లి గ్రామంలో నర్సరీ,ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని, ఉపాధి హామీ పనులు నిబంధన ప్రకారం చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీలలో మొక్కలు సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజిని, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించారు'

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి లోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మాజీ యుజిసి సభ్యుడు ప్రొఫెసర్ శివరాజు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ పీజీ కళాశాలకు న్యాక్ గుర్తింపు, అటానమస్ రావడానికి అప్పట్లో ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమన్వయం చేసుకుంటూ విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారని కొనియాడారు. అనంతరం అధ్యాపకులు, అలుమ్ని సభ్యులతో ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి జ్ఞాపకను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.కిష్టయ్య, డా.రాజగంబీర్, డా.సుధాకర్, అలుమ్ని సభ్యులు డా.రాహుల్ కుమార్, డా.సంతోష్ గౌడ్, డా.సత్యంలు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యతపై అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జీవన నైపుణ్యతపై అవగాహన కల్పించినట్టు ఇంపాక్ట్ సమస్త మోటివేషన్ స్పీకర్ రమేష్ చైతన్య తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఎలా ఎదగాలి ఎదుగుదలకు కావలసిన శిక్షణ, నడవడిక అలవాట్లు, సంస్కృతి సంప్రదాయాలు విలువల పైన విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాల్యంలో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సదువుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి విద్యార్థి సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చాలన్నారు. ఈ సమావేశం విద్యాధికారి షౌకత్ అలీ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఏర్గట్లలో భేటి బచావో భేటి పడావో

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భీంగల్ ప్రాజెక్టు సీడీపీఓ స్వర్ణలత ఆధ్వర్యంలో భేటి బచావో-భేటి పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టప్రకారం నేరమని, బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. బాలిక సంరక్షణ వాటి అంశాలను ఉద్దేశాలను వివరించారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తిని పెంచాలని కోరారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మునీరోద్దీన్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ స్వర్ణలత

ఎస్ఎస్ఆర్ పాఠశాలలో సైన్స్‌ఫెయిర్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్‌లోని మాధవ నగర్‌లోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ అకాడమీ (సీబీఎస్ఈ) పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సొంత ప్రతిభతో ప్రయోగాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ సంస్థ అధినేత డాక్టర్ మారయ్యగౌడ్ సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు.


సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ మారయ్యగౌడ్

13వ డివిజన్‌లో నీటి ఎద్దడి


- ఖాళీ బిందెలతో మహిళల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని సారంగాపూర్‌లోని 13వ డివిజన్‌లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గత 15 రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో డివిజన్ మహిళలు శనివారం రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీరు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అలాగే డ్రయినేజీలు సక్రమంగా తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు విజృంభించి రోగాల భారిన పడుతున్నామని అన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

హోవర్డ్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



సైన్స్‌డేలో విద్యార్థుల ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హోవర్డ్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోవర్డ్ సంస్థల అధినేత్రి శశికళ మాట్లాడుతూ.. మన సంస్కృతిలో భాగమే తులసి, పసుపు, గోరింటాకు మొదలైనవన్నీ సైన్స్ సంబంధిత ఆరోగ్య సూత్రలు అని సూచించారు. కరస్పాండెంట్ టి.వి.ఆర్. మూర్తి మాట్లాడుతూ.. మనం నమస్కరించే విధానం, వేసే సూర్యనమస్కారాలు, ఆసనాలు, పరిశుభ్రత పాటించడం అన్నీ కూడా సైన్స్ ఆధారిత నియమాలు అని తెలిపారు. అలాగే ప్రతీ విషయాన్ని లోతుగా ఆలోచించినప్పుడే సరికొత్త శోధన బయటకు వస్తుందని సందేశమిచ్చారు. ఈ కర్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు క్యాంప్ డీ28 కెనాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే


కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సాగునీరు అందక పంటలు ఎండిపోతుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన డీ-28 కెనాల్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు శుక్రవారం సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీలో రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులను నిర్బంధించిన నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహించడంతో శనివారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించి సాలూర క్యాంప్ వద్ద గల డీ-28 కెనాల్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు ఎండిపోకుండా రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపడతామని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, అల్లె రమేష్, నాగేశ్వరరావు, మంధర్న రవి తదితరులు ఉన్నారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్ కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్ 2024 సిటిజన్ ఫీడ్ బ్యాక్ కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయం అందిస్తున్న సేవలపై ప్రజలు రెండు నిమిషాలు సమయానికి కేటాయించి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి పట్టణాన్ని దేశంలోనే ఉత్తమ పట్టణంగా నిలబెడుదామని పట్టణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చాంద్‌క నజర్ ఆగయా

- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం
- మస్‌జిద్‌ల వద్ద ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆధ్యాత్మిక, సోదరభావాన్ని పరిమళింపజేసే పవిత్ర మాసంగా ముస్లింలు రంజాన్‌ను భావిస్తుంటారు. ఈ మాసంలో ముస్లింలు నిష్టతో కూడిన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఉర్దూ క్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని 9వ మాసంలో రంజాన్ నెల వస్తుంది. మొత్తం 29 లేక 30 రోజులపాటు ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ దీక్షలను తెల్లవారు జామున సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత నియమ నిష్టలతో పూర్తిచేస్తారు. దీక్షా సమయంలో సత్య సంభాషణ, నైతిక ధర్మాచారాలతో దైవవిశ్వాసాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఉపవాసం చేసేవారు సాయంత్రం దీక్ష విరమించే వరకూ నీటిని కూడా తాగరు. కనీసం లాలాజలాన్ని కూడా గొంతుదాటి లోనికి వెళ్లకుండా దీక్ష చేస్తారు. "సూర్యోదయానికి ఫజర్ నమాజ్, మధ్యాహ్నం జోహర్ నమాజ్, సాయంత్రం నుంచి 5వరకు అసర్ నమాజ్ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు ప్రార్థనా మందిరాలకు చేరుకుని ఉపవాస దీక్షలను విడుస్తారు. తమవెంట తెచ్చుకున్న పండ్లతో దీక్షను విరమించి మగ్రీబ్ నమాజ్ చేస్తారు. అనంతరం భోజనాలు ముగించుకుని ఇషా నమాజ్ తర్వాత తరావీ నమాజ్ చేస్తారు.

దైవభక్తిని పెంపొందించే తరావి నమాజ్..

రంజాన్ మాసంలో ప్రత్యేకంగా చేసే తరావి నమాజ్ దైవభక్తిని పెంపొందిస్తుంది. ఈనెలలో 29 లేక 30 రోజుల పాటు చేసే ఐదుపూటల నమాజ్తో పాటు తరావి నమాజు అదనంగా చేస్తారు. సుమారు గంటన్నర నుండి రెండున్నర గంటలపాటు ఏకధాటిగా ఈ నమాజ్ కొనసాగుతుంది. నమాజ్లో ఖురాన్‌కు చెందిన 30 అధ్యాయాల్లోని శ్లోకాలను ఒకటి నుండి రెండున్నర పేరాల వరకూ హపిజ్-ఎ - ఖురాన్ (ఖురాన్ చూడకుండా చదివే వ్యక్తి) ప్రతిరోజూ కొన్నింటిని చదువుతారు. ఇక ఇషా నమాజ్ తర్వాత ఇది పాటిస్తారు. రంజాన్ ప్రారంభానికి ఒక రోజు ముందు మొదలయ్యే ఈ తరావీ నమాజ్ 29 లేక 30 రోజుల దీక్షల అనంతరం ఈదుల్ ఫితర్- పండగ పర్వదినానికి ఒక రోజు ముందుతో తరావి నమాజ్ ముగుస్తుంది.

పేదల హక్కు జకాత్..

ఇస్లాం నిర్దేశించిన ఆరు సూత్రాల్లో జకత్ ఒకటి. తమవద్ద ఉన్న ఆస్తి పాస్తులో కొంతైనా నిరుపేదలకు, పేదలకు పంచివ్వాలన్నదే జకాత్ సారాంశం..

ఫిత్ర..

రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు తన ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా తన సంపాదనలో కొంత మేరకు దానం చేయాల్సి ఉంటుంది. దీనినే ఫిత్రగా పిలుస్తారు. కుటుంబంలో ఉన్న సభ్యుల లెక్కన నాణ్యమైన గోధుమలు, జొన్నలకు మార్కెట్లో కిలో విలువ లెక్క కట్టి ఆ లెక్క ప్రకారం ఒక మనిషికి ఒక కిలో విలువ కట్టి అ డబ్బులను నిరుపేదలకు, పేదలకు, తమ కుటుంబంలో ఉన్న పేదలకు (ఇద్ ఉల్ ఫితర్) పండుగ కంటే ముందు పంచి పెట్టడమే ఫిత్ర ఉద్దేశం.

ఎతెకాఫ్ వ్రతం..

రంజాన్ మాసంలో 21వ రోజు నుంచి పండగ ముందు రోజు వరకు ఉనవాస దీక్షాపరులు "ఎతెకాఫ్" వ్రతాన్ని కొందరు పాటిస్తారు. ఈ సందర్భంగా వారు భవ్య ప్రపంచాన్ని పూర్తిగా మైమరిచి మసీదుల్లో దైవ ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. నెలవంక కనిపిస్తేనే వారు ఎతెకాఫ్ వ్రతాన్ని విరమిస్తారు. పండగ రోజు నమాజ్ అనంతరం తమ తమ ఇండ్లకు చేరుకుని సీర్ కుర్మా సేవిస్తారు. ప్రధాన పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ఉపవాస దీక్షల అనంతరం హలీం, హారిస్, దైవడ, కద్దుకి ఖీర్, డబుల్ కామీట, ఖుర్బానీక మీటతో పాటు తదితర వంటకాలను భుజిస్తారు.



దురల వాట్లకు దూరంగా..

సిగిరెట్, బీడీ, మద్యపానం, గుట్కా పాన్తోపాటు ఇతరత్రా చెడు అలవాట్లకు చాలా వరకు రంజాన్ మాసంలో దూరంగా ఉంటారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలంతా విధిగా రోజా (ఉపవాస దీక్ష పాటించి అల్లాహ్ నిర్దేశించిన అన్ని రకాల నమాజ్‌లను ప్రతి ఒక్కరూ చిన్న పెద్ద తేడా లేకుండా ఆచరించాలని ఖురాన్ ముస్లింలకు ఆదేశిస్తుంది. ఉపవాస దీక్ష పాటి ంచిన, పాటించకపోయిన రంజాన్ మాసంలో రోజు చేసే నమాజ్, తరావి నమాజ్కు భక్తి శ్రద్దలతో వెళ్తుంటారు.



పండ్లకు ప్రాధాన్యం..

రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నవారు తెల్లవారుజాము నుండి సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఆహారంగాని మంచి నీళ్లుగాని తీసుకోరు. అయితే దీక్ష విరమణకు పండ్లను ఆరగిస్తారు. ముఖ్యంగా ఖర్జూర పండ్లకు మతపరంగా ప్రత్యేక ప్రాధాన్యముంది. మహ్మద్ ప్రవక్త ఉపవాస దీక్షను ఖర్జూర పళ్లుతిని విరమించారని ప్రతీతి. అందువల్ల ముస్లింలు రోజూ విరమణ సమయంలో ఖర్జూర పళ్లను తినడం పవిత్ర కార్యంగా భావిస్తారు. దీక్ష విరమణ సమయంలో జామ, సేపులు, ద్రాక్ష, పుచ్చకాయలు, అనార్, బొప్పాయి, సంత్రా, మోసంబి, అరటిపండ్లు, దోసకాయలు తీసుకుంటారు. అనంతరం ఈ మాసంలో ప్రత్యేకంగా వెలిసిన హొటళ్లో హలీం, హరీస్, దైవవ, డబుల్ కా మీటా ఇతర తిను బండారాల కోసం ప్రత్యేకంగా దుకాణాలు వేలుస్తాయి..

షబ్-ఎ-ఖదర్..

రంజాన్ మాసంలో 26వ రోజున షబ్-ఎ-ఖదర్ జరుపుకుంటారు. ఆ రోజున 30 షారాల ఖురాన్‌ను పఠిస్తారు. ఖురాన్ పఠనం ఈ రోజుతో ముగుస్తుంది. ఇదే రోజు రాత్రి మసీదుల్లో పురుషులు, నివాస గృహల్లో మహిళలు, చిన్నారులు జగ్నేకి రాత్ను నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక నియమ నిష్టతో (జాగరణ) పాటిస్తూనే ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం నెల రోజుల పాటు ఖురాన్ వినిపించిన హాఫీజ్-ఏ-ఖురాన్ (మౌల్వి సాబ్)లను మస్జిద్ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తారు.

30 రోజులు.. 3భాగాలు

రంజాన్ నెలను మూడు భాగాలుగా భావిస్తారు.. ఇందులో తొలి 1రోజు ఉ పవాస దీక్ష నుంచి 10వరకు రహమత్గా కొలుస్తారు. 11వ రోజు ఉపవాస దీక్ష నుండి 20వ రోజు వరకు మాగ్ఫిరత్ (క్రమకోదడం), మూడోది.. 21నుండి 30వ రోజు పది రోజులు ఉపవాస దీక్షను జాహ్నం నిజ్జత్ చివరి పది రోజుల్లో వచ్చే బేసిక్ సంఖ్యలైన 21, 23, 25, 27, 29వ రోజు తక్రేత్‌గా పిలుస్తారు. ఈ రాత్రుల్లో జాగరణ చేస్తే దీనిలో ఏదో ఒక్క రోజు షబ్-ఎ- ఖాదర్ను తమ వైపు చేసుకోవడానికి రాత్రుల్లో జాగరణ చేస్తారు. షబ్ -ఎ- ఖాదర్లోనే ఖురాన్ను అల్లాహ్ భూమి మీదకు పంపినట్లు ముస్లింలు విశ్వసిస్తారు. షబ్ -ఎ- ఖాదర్లో రాత్రి జాగరణ చేస్తే వెయ్యి నేలలకు సమానంగా కొలుస్తారు. ఆ రాత్రిని జాగరణ చేస్తే పాపాలను తొలగించి తమ కోర్కెలు - తీరుస్తారని విశ్వాసం.

సోదరభావాన్ని పెంపొందించే ఇఫ్తార్..

రంజాన్ ఉపవాస దీక్షల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 4 తర్వాత నుంచి సూర్యాస్తమయం వరకు దీక్షలు విరమించే సమయాన్ని ఇఫ్తార్ అంటారు. చిన్నా పెద్ద, ధనిక పేద తేడా లేకుండా ఒకేచోటు గుమిగూడి కూర్చుని సామూహిక ఇఫ్తార్ చేస్తారు. ఈ సమయాల్లో మసీదుల్లో కొత్త కాంతులు సంతరించుకుంటాయి. ముస్లింలతోపాటు హిందువులు, క్రైస్తవులు, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులు ఇస్తూ వారు కూడ ఇఫ్తార్ విందులో పాల్గొని మత సామరస్యాన్ని చాటుతారు. నెలరోజులపాటు ఇఫ్తార్ విందులు అనునిత్యం కొనసాగుతుంటాయి.

గల్ఫ్‌లో శనివారం మన దేశంలో నేటి నుంచి..

గల్ఫ్‌లో శుక్రవారం నెలవంక దర్శనమివ్వడంతో శనివారం ఉపవాస దీక్షలు ఘనంగా నిర్వహించుకున్నారు. మన దేశంలో శనివారం నెలవంక కనపడటంతో ఆదివారం నుంచి దీక్షలు ప్రారంభమయ్యాయి. గల్ఫ్‌లో మన దేశంలో ఒకరోజు ముందుగానే రోజా ఉపవాస దీక్షలు మొదలు కావడంతో మన దేశంలో ఒక రోజు ఆలస్యంగా రంజాన్ దీక్షలను పాటించారు.

మసీదులు, నివాస గృహాలు సిద్ధం..

రంజాన్‌ను పురస్కరించుకుని ప్రార్థన లాశకోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మస్జిద్ కమిటీల ఆధ్వర్యంలో మస్జిద్‌లను సర్వం సిద్ధం చేశారు. కొందరు ముస్లిం సోదరులు తమ తమ నివాస గృహాలను సుందరంగా తీర్చిదిద్దారు. రంజాన్ నెల మొదలు కాక ముందు నుంచే ఆయా కమిటీల ఆధ్వర్యంలో మస్జిద్‌లను శుభ్రం చేసి రంగులు, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. రంజన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రార్థనల కోసం వచ్చే వారికి ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజారాంనగర్ కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రాజారాంనగర్ కాలనీ శివాలయం గుడి వెనకాల ప్రభుత్వ కాళీ స్థలాన్ని కబ్జా చేసి కమ్యూనిటీ హాలు నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. శనివారం ఏసిపి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజారాంనగర్ కాలనీలో గత 20 సంవత్సరాల నుంచి శివాలయం ఉందని, ఈ ఆలయానికి కాలనీ వాసులతో పాటు మామిడిపల్లి, పట్టణ ప్రజలు ప్రతిరోజు వస్తారని, పండగ సందర్భాలలో ఉత్సవాలు, అన్నదానాలు నిర్వహిస్తారని తెలిపారు. దీని వెనక గల ప్రభుత్వ స్థలం పార్కింగ్‌కు ఉందని అన్నారు. 2022 సంవత్సరం సెప్టెంబర్ 6న కొందరు ఈ స్థలంలో కబ్జా చేసి వారి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసుకుని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై అప్పట్లో సైతం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, కమ్యూనిటీ హాలు నిర్మాణం విరమించుకున్నారని తెలిపారు. దీంతో శనివారం స్థలాన్ని కబ్జా చేయుటకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి టెంటు వేసి పనులు మొదలు పెట్టుటకు ప్రయత్నించగా అడ్డుకున్నామని తెలిపారు. దీంతో వారు బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. కబ్జా బారి నుండి కాపాడి నిర్మాణాలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు కొట్టూర్ ఆనంద్, గట్ల శ్రీనాథ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఉత్సవాల్లో పాల్గొన్న సునీల్ కుమార్


పూజలు చేస్తున్న ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం మోతె గ్రామంలో శనివారం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి జాతర, రథోత్సవం కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామికి సునీల్ కుమార్ పూజలు చేశారు. ఆయనకు ఆలయ పురోహితులు స్వామివారి ఆశీర్వచనాలు అందించి, దీవించారు. అనంతరం రథోత్సవంలో పాల్గొన్న ఆయన ప్రజలతో కలిసి రథాన్ని లాగారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరి తీరాన మతిస్థిమితం లేని మహిళ

- స్వగ్రామానికి పంపిన పోలీసులు

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని కంద కుర్తి గోదావరి త్రివేణి సంగమం తీరం వెంబడి అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను గుర్తించిన యోగేష్ అనే యువకుడు అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ప్రణీత్, నీరజకు సమాచారం అందించారు. నీలా గ్రామానికి చెందిన గంగామణి గోదావరి ఘాట్ సమీపంలో ఉన్న తీరం వెంబడి వెళుతూ ఉండడంతో పోలీసులు ఆమెను విచారించారు. ఆమె వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో పక్కనున్న వారు గుర్తించి ఆమె నీల గ్రామానికి చెందిన మహిళగా పేర్కొనడంతో పోలీసులు గ్రామ పెద్దలతో విచారించారు. ఆమెకు స్వల్పంగా మతిస్థిమితం ఉందని తమ గ్రామానికి పంపించండి వారు తెలపడంతో ఆమెను నీల గ్రామానికి చెందిన వ్యక్తితో బైక్‌పై పంపించారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

- ఎంపీడీవో వెంకటేష్ జాదవ్


మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలో ఉపాధి హామీ పనుల వేగవంతం చేయాలని, అలాగే గ్రామ కార్యదర్శులు గ్రామ పంచాయతీ పన్నులను 100శాతం వసూలు చేయాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో నిధుల కొరత ఉన్నందున, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ పనులను 100శాతం వసూలు చేస్తేనే వారికి నీటి సమస్య, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడానికి కూలీలను ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఫీ హైమద్, ఏపీఓ రమణ, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థుల భవిష్యత్తు

- రెంజల్ ఎస్సై ఈ.సాయన్న

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటే వారి భవిష్యత్తు బంగారు బాటగా మారుతుందని రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలోని యూనిక్ పబ్లిక్ స్కూల్ 14వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న వయసు నుంచి అంకితభావంతో, క్రమశిక్షణతో ఉన్నప్పుడే వారి భవిష్యత్తు మారుతుందని అన్నారు. ఈ వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ యూసుఫ్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, గ్రామపెద్దలు హాజీ ఖాన్, సద్దాం, చాంద్‌పాషా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో రెండు ఇండ్లల్లో చోరీ

- రూ.5లక్షల 20వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రెండు ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. రెండు ఇండ్లలో కలిపి రూ.5లక్షల 20వేల నగదు, తులం బంగారం దుండగులు ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించి కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మినుముల గంగాధర్ ఇంట్లోకి చొరబడ్డ దుండగులు బీరువా తాళం పగులగొట్టి అందులోని రూ.5లక్షల నగదు, అర తులం బంగారం ఎత్తుకెళ్లారు. అదేవిధంగా గ్రామానికి చెందిన వంకార్ శ్రీనివాస్ ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు రూ.20వేల నగదు, అర తులం బంగారం దొంగిలించి పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చోరీ సమయంలో బాధితులు వారి కుటుంబ సభ్యులతో వేరే గదిల్లో నిద్రపోతున్నట్లు ఆయన తెలిపారు. చోరీ జరిగిన ఇండ్లలో క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించినట్లు ఆయన తెలిపారు

ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

అనధికార లే అవుట్ ప్లాంట్లను క్రమబద్ధికరించే క్రమంలో ఏదైనా సందేహాలుంటే వాటిని బోధన్ మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ద్వారా పరిష్కరించుకోవాలని కమిషనర్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనధికారిక లేఅవుట్లలోని ప్లాట్లు, అనధికారిక లేఔట్లను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో 2020 సంవత్సరంలో ధరఖాస్తు చేసుకున్న వారు మార్చి 31, 2025 లోగా క్రమబద్ధీకరించి ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని ప్రభుత్వం, (జీవో నెం.28 తేదీ. 20.02.2025) ద్వారా ఆదేశాలు జారీచేసిందని పేర్కొన్నారు. కావున మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తుదారులు ఏమైనా సందేహాలుంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లో తెలియజేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్‌లో 25శాతం రాయితీని ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సదరం దరఖాస్తుదారులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-బోధన్

సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుని, వైకల్య నిర్ధారణ కోసం హాజరయ్యే వారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సదరం సేవలను సులభతరం చేస్తూ ఇటీవలే కొత్తగా యూనిక్ డిజెబిలిటీ ఐ.డీ (యూడీఐడీ) పోర్టల్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యల గురించి శనివారం సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవరాజన్ కలెక్టర్లు, డీఆర్డీఓలు, డిడబ్ల్యూఓలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వికాస్ మహతోతో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వీ.సీలో పాల్గొన్నారు. వీ.సీ అనంతరం కలెక్టర్


వీసీలో పాల్గొన్న కలెక్టర్, బోధన్ సబ్ కలెక్టర్

సంబంధిత అధికారులతో సమావేశమై, సదరం సర్టిఫికెట్ల కోసం ఇకనుంచి యు.డీ.ఐ.డీ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకునేలా చూడాలన్నారు. ఆన్లైన్‌లో నేరుగా కానీ, మీ-సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి సంక్షిప్త సందేశం (ఎస్.ఎం.ఎస్) ద్వారా సదరం క్యాంపునకు ఎప్పుడు హాజరు కావాలనే సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుందన్నారు. అయితే ఆన్లైన్లో దరఖాస్తు చేసే సమయంలో అక్షర దోషాలు, ఇతర తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ మేరకు మీ సేవ ఆపరేటర్లకు శిక్షణ అందించాలని సూచించారు. ఇప్పటివరకు ఐదు రకాల కేటగిరీల వారికే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేదని, కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల కేటగిరీలను చేర్చారని కలెక్టర్ వివరించారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సదరం శిబిరాలలో వైకల్య నిర్ధారణ జరిగిన మీదట, సదరం సర్టిఫికెట్లను స్మార్ట్ కార్డు రూపేణా పోస్టల్ శాఖ ద్వారా ఇంటి చిరునామాకు పంపిస్తారని అన్నారు. చేయూత పెన్షన్లతో పాటు ఇతర అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాల లబ్ధి కోసం సదరం స్మార్ట్ కార్డు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. ఆన్లైన్ ద్వారా కూడా సదరం సర్టిఫికెట్‌ను ఎప్పుడైనా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా, వైకల్య నిర్ధారణ కోసం శిబిరాలకు వచ్చే దరఖాస్తుదారులకు తాగునీరు, టాయిలెట్స్, కూర్చునేందుకు కుర్చీలు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'కంటైనర్ డిపో నిర్మిస్తామని హామీ'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎస్ రమేష్‌ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిజామాబాద్ అధ్యక్షులు రావులపల్లి జగదీశ్వర్‌రావు ఆధ్వర్యంలో కలిసి నిజామాబాదు వర్తకుల సమస్యలను చర్చించారు. సరుకుల ఎగుమతులపై కంటైనర్ డిపో అవసరాన్ని వివరించగా, వెంటనే కంటైనర్ డిపోను మంజూరు చేసి అతిత్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇతర రైల్వే ట్రాన్స్‌పోర్ట్ సమస్యలు ఒక ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మావేశంలో ప్రముఖ పసుపు వ్యాపారస్థులు రమేష్ గుప్తా, ఆకుల సందీప్, కార్యదర్శి కమల్ ఇనాని తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌ను సత్కారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. శనివారం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ స్థాయికి చేరుకోవడం పట్ల కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల బాలకృష్ణ, ఉపాధ్యక్షులు జోగ గంగాధర్, ప్రధాన కార్యదర్శి చిలివేరి పవన్ కుమార్, కోశాధికారి సురంగి చంద్రశేఖర్, గౌరవ సభ్యులు లుక్క గంగాధర్, హమ్మద్ హుస్సేన్, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని నాగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠశాలలోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించి, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. సరుకులలో నాణ్యత లేకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు భోజనం అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి ఎంపీడీవో భోజనం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఉపాధ్యాయులు సాంబార్ కిషన్, తదితరులు ఉన్నారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం

నవతెలంగాణ-పోతంగల్(కోటగిరి)/కంఠేశ్వర్

కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిజామాబాద్ జిల్లా సహాయ


పొతంగల్‌లో..

కార్యదర్శి సోంపూర్ కే.పోచిరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రతి పల్లెనా మాదిగ అమరవీరులైన 11 మంది చిత్రప టాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటగిరి మండల అధ్యక్షులు హస్కుల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు కన్నం శ్రీనివాస్, గ్రామ యూత్ అధ్యక్షులు జెండా దినేష్, పోతంగల్ మండల ఉపాధ్యక్షులు నాక్కేవర్ సాయిలు, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల యాదవ్, సంజీవ్, మస్నాజీ, యాదవ రావు, గడ్డం సాయిలు, కృష్ణ, రాములు, సంగయ్య, అబ్బయ్య పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : పోరాటంలో వర్గీకరణ సాధించుకోవడానికి నిరంతరం జరుగుతున్న పోరాటంలో భాగంగా మాదిగ ఉప కులాలు ఎంతో మంది అమరులయ్యారు. అమరులైన మాదిగ మృతవీరులకు శనివారం ఘన నివాళులర్పించారు. వారి ఆశయాలను ముందుకు నడిపే విధంగా కొనసాగిస్తామని తక్షణమే ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపైన 59 కులాలకు ఏబిసిడి వర్గీకరణ అమల్లో పెట్టాలని తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణపైన చట్టబద్ధత కల్పించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాది ఉద్యోగస్తుల జిల్లా నాయకులు గంగారం మాదిగ, జిల్లా అధ్యక్షులు రాములు మాదిగ, ఉద్యోగస్తుల నాయకులు గంగ నరసయ్య మాదిగ, మల్లేష్, రాములు, లాయర్ల ఫెరిడేషన్ ఆశ నారాయణ, లాయర్ల నాయకుడు సుజిత్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

సన్‌షైన్ స్కూల్‌లో సైన్స్ డే

నవతెలంగాణ-ధర్పల్లి


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

మండల కేంద్రంలోని సన్‌షైన్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శనివానం ఘనంగా నిర్వహించారు. సైన్స్ డే సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో వివిధ రకాల సైన్స్ నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఐటి శిరీష, కరస్పాండెంట్ ఇంజపురం మహేందర్, డైరెక్టర్ గంగరాజుల సుమలత, టీచర్స్ దివ్య, జయసుధ, నవనీత, వైష్ణవి, రాగిణి, శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-పోతంగల్ (కోటగిరి)

మండల కేంద్రంలో మాలివాడ ఎంపిపిఎస్ పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, వంటశాల పరిశుభ్రతను, వాడుతున్న వంట సామగ్రిని, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, ఎండిఎం రోస్టర్ రిజిస్టర్, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వారికి పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శానం సాయిలు అన్నీ విషయాలను వివరించారు.

ఎంఈవోగా శివలింగ్ గాలప్ప

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారిగా కుర్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివలింగ గాలప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఆర్టియు(టీఎస్) మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి శివలింగ్ గాలప్పాను స్వాగతించారు. అనంతరం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాజా మాజీ మండల విద్యాశాఖ అధికారి అంనేయులు, బీఆర్‌టియు(టిఎస్) మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సాయిరెడ్డి, గోవర్ధన్, మండల అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, మండల కార్యదర్శి బాలేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు, సీనియర్ సీనియర్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండకు అవార్డుల పంట

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండకు ఆరు ఉత్తమ అవార్డులు పొందామని లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్మన్ చాకులింగం, జ్ఞాన సాగర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆర్మూర్‌లో శుక్రవారం చంద్రాస్ రీజియన్ సిక్స్ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ నగేష్ పంపాటి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నట్టు పేర్కొన్నారు. బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రెటరీ, బెస్ట్ ట్రెజరర్, బెస్ట్ జోన్ చైర్మన్, ఉత్తమ సేవ అవార్డులు వచ్చాయని తెలిపారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ అధ్యక్షుడు అందె వెంకటగిరి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజశేఖర్, నరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

జాతీయ అంధత్వ నివారణ పథకం, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు కంటి పరీక్షలు శనివారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కంటి సమస్యలను గుర్తించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు ప్రతి గ్రామానికి వెళ్లి బాలబాలికలకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నారని ఎంఈఓ బట్టు రాజేశ్వరి తెలిపారు. సైట్ ఆధారంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఈ కంటి వైద్య పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ గురురాజ్, మెడికల్ ఆఫీసర్ సూర్య నారాయణ, ఏఎన్ఎం స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడటంతో తెడ్డు శ్రీకాంత్(23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. జానకంపేట్ గ్రామ శివారులో శ్రీకాంత్ పని నిమిత్తం వెళ్తున్న సమయంలో అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను లిఫ్ట్ అడిగి ఎక్కాడు. మార్గమధ్యలో అతనికి ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిపోయి మృతి చెందాడు. మృతుడి తల్లి తెడ్డు సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురికి కాలువల్లో చెత్త

నవతెలంగాణ-బాల్కొండ



మండల కేంద్రంలోని నడుమి గల్లీలోని మురికి కాలువలలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, దీంతో దోమల బెడద ఎక్కువైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి డ్రైనేజీ అధ్వానంగా తయారైందని వారు వాపోయారు. అధికారులు స్పందించి మురికి కాల్వను వెంటనే శుభ్రం చేయాలని కోరారు.

యువత చేతిలో భారత విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.శివరాజ్

నవతెలంగాణ-భిక్కనూర్

భారత దేశ విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి యువత చేతిలోనే ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.శివరాజ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్ సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనల ఫలితంగా శాస్త్ర విజ్ఞానంలో చాలా మార్పులు వచ్చాయని అనేక నూతన ఆవిష్కరణలకు అది ఊతం ఇచ్చిందన్నారు. ఆవిష్కరణకు సీవి రామన్‌కు దేశంలోనే మొదటగా నోబెల్ బహుమతి వచ్చిందని అందుకే ఈ ప్రయోగం ఫలించిన రోజైన ఫిబ్రవరి 28రని జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం థీమ్ ప్రకారం యువత నైపుణ్యాలు పెంచుకొని వికసిత భారత్ కోసం శాస్త్ర విజ్ఞాన రంగంలో


గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అలాగే అతిథి ప్రొ.మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర వేత్తలను ఆదర్శంగా తీసుకొని రీసెర్చ్ లో ముందుకెళ్లాలని, ప్రశ్న నుంచి కొత్త ఆలోచనలు ఉద్భవిస్తాయి అన్నారు. ప్రకృతిలో జరుగుతున్న అనేక విషయాలపై ప్రశ్నలు వేసుకుంటూ సమాధానం కోసం పరిశోధన నిర్వహించాలని తద్వారా కొత్త ఆవిష్కరణలు చేసి సమాజానికి అందించాలని కోరారు.

సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్సిటీ లో ఉన్న సౌకర్యాలను వాడుకుంటూ పరిశోధకులుగా ఎదగాలని, పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాల న్నారు. అనంతరం సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.రాజేశ్వరి, ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు డా.లలిత, వైశాలి, డా.సరిత పిట్ల, దిలీప్, డా.శ్రీమాత, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డా.నాగరాజు, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డా.సునీత, బాయ్స్ హాస్టల్ వార్డెన్ డా. యాలాద్రీ, డా.నారాయణ, డా.రమాదేవి డా.నిరంజన్ శర్మ డా.ఇంద్రకరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దొంగను పట్టుకున్న పోలీసులు

- బస్సు ఎక్కే సమయంలో గుంపులో దూరి పలువురి మహిళల బంగారం చోరీ : సీఐ జగడం సురేశ్

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద బస్టాండ్ లో వరుసగా మహిళల మెడలో నుంచి బంగారు గుండ్లు దొంగతనం చేస్తున్న మహిళను శనివారం ఉదయం బిచ్కుంద పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ జగడం సురేశ్ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్న శాంతాబాయి మధుకర్ కాంబ్లే నివాసం కమల్ నగర్ తాలూకా ఔరద్ కర్ణాటక రాష్ట్రం. రద్దీగా ఉన్న బస్సు వద్దకు వెళ్లి ప్యాసింజర్లతో కలిసి బస్సు ఎక్కుతూ మహిళ మెడలో ఉన్న బంగారు గుండ్లు ఇతర ఆభరణాలు దొంగిలించి ఆ బస్సు ఎక్కకుండా తిరిగి అక్కడి నుంచి ఆటోలో జుక్కల్ చౌరస్తా నుండి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

మహారాష్ట్రలోని హనేగావ్ మీదుగా కమల్ నగర్ కు చేరుకునేదనీ తెలిపారు. బిచ్కుంద బస్టాండ్ నుండి ఇప్పటివరకు పలువురు మహిళల మెడలో నుండి బంగారు గుండు దొంగలించినట్లు విచారణలో తేలగా దొంగతనానికి పాల్పడిన మహిళపై నాలుగు కేసులు నమోదు చేసి దొంగలించిన 5 తులాల బంగారు నగలను తిరిగి పంచుల సమక్షంలో కమల బాయి వద్దనుండి స్వాధీనం చేసుకొని కమలాబాయి నీ జ్యుడిషరీ రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. మహిళ దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ నదీమ్, పోలీస్ సిబ్బంది ని సీఐ ప్రశంసించారు. ఆయన వెంట ఎస్సై మోహన్ రెడ్డి కానిస్టేబుల్ లు ఉన్నారు.

వీరన్నగుట్టలో ఘనంగా వీరభద్రుడి జాతర

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో శనివారం సాయంత్రం ఘనంగా వీరభద్రుడి జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. గత ఏడాది కంటే ఎక్కువ మొత్తంలో వ్యాపారులు రావడంతో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. రెంజల్, దండిగుట్ట, కళ్యాపూర్, దూపల్లి తదితర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్ దీపాలను ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేసి వ్యాపారులకు సహకరించారు. వీరభద్రుడి విగ్రహాన్ని ఆలయం ప్రాంగణం నుంచి డప్పు వాయిద్యాల మధ్యన రథం వరకు తీసుకువచ్చి రథంపై పూజారి నాగ నాదప్ప, ప్రత్యేక పూజలు చేసి భక్తులు పేలలు చల్లుతూ, రథం చుట్టూరా తిప్పారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.


జాతరలో పాల్గొన్న గ్రామస్తులు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా రెంజల్ ఎస్సై సాయన్న పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విజ్ఞాన విహారయాత్రతో విద్యార్థులకు మేధస్సు

- ఎంఈఓ బట్టు రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

విజ్ఞాన విహారయాత్రలతో విద్యార్థులకు మేధస్సు పెంపొందుతుందని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా పీఎం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

చెందిన విద్యార్థులు శుక్రవారం విహార యాత్రకు వెళ్లారు. ఈ విహారయాత్రలో శనివారం హైదరాబాద్‌లోని జూపార్క్, బిర్లా సైన్స్ మ్యూజియం, నక్షత్రశాల, ఇతర ప్రాంతాలను సందర్శించారు. ఈ విహారయాత్రకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వెళ్లారు.

ట్యాక్స్ వసూళ్ల డ్రైవ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి శనివారం ఉదయం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేశారు. అధిక బకాయిలు ఉన్న వ్యాపార సముదాయాలకు కమిషనర్ స్వయంగా వెళ్లారు. వాసవీ డిజిటల్ రూ.2.33లక్షలు, భవాని డెంటల్ ఆస్పత్రి రూ.7.42లక్షలు, ప్రియాంక స్కిన్ క్లినిక్ రూ.12.96లక్షలు, కేర్ డిగ్రీ కళాశాల రూ.1.91 వేలు, హై టెక్ మొబైల్స్ రూ.5లక్షల పన్ను బకాయిలు వసూలు చేశారు. ఒకే రోజు సుమారు రూ.29లక్షల బకాయిలను వసూలు చేశారు. అలాగే స్వగత్ హోటల్‌లో తనిఖీ లు నిర్వహించి పరిశీలించారు. ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు.